క్లుప్తంగా

రాయితీతో బిందు సేద్య పరికరాలు



బిందు సేద్య పరికరాల వినియోగంపై రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ సిబ్బంది

కనగానపల్లి: అర్హులైన రైతులందరికీ ప్రభుత్వం రాయితీతో బిందు సేద్య పరికరాలు అందజేస్తోందని ఎంఏఓ రవిశంకర్ తెలిపారు. సోమవారం మండలంలోని కోనాపురం గ్రామంలో రైతు జయరాం పొలంలో బిందు సేద్య పరికరాల వినియోగంపై రైతులకు అవగాహన కల్పించారు. ఎంఏఓ మాట్లాడుతూ ఉద్యాన పంటలు సాగు చేసే రైతులకు సూక్ష్మ, బిందు సేద్య పరికరాలు ఉపయోగకరంగా ఉంటాయన్నారు. వీటిని ప్రభుత్వం రైతులకు 50 నుంచి 90 శాతం సబ్సిడీ ధరతో అందిస్తోందన్నారు. కార్యక్రమంలో స్థానిక వీఏఏలు, వీఎస్ఏలు, కంపెనీ ప్రతినిధులు, పలువురు రైతులు పాల్గొన్నారు.

ముదిగుబ్బలో కంటివైద్య శిబిరం



కంటివైద్య పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

ముదిగుబ్బ: మండల కేంద్రంలోని సాయినగర్ సచివాలయ పరిధిలో సోమవారం కంటి వైద్య శిబిరం నిర్వహించారు. వైఎస్సార్ కంటి వెలుగు కార్యక్రమంలో వైద్యాధికారి రాజేంద్ర 62 మందికి కంటి పరీక్షలు చేసి 12 మందిని శస్త్రచికిత్సలకు ఎంపిక చేశారు. 20 మందికి అద్దాలకు రెఫర్ చేశారు. 30 మందికి మందులు ఇచ్చారు. కార్యక్రమంలో డాక్టర్ జయరామ్ సిబ్బంది పాల్గొన్నారు.

వీఆర్ఓల సంఘం అధ్యక్షుడికి సన్మానం



మహేశ్వరరెడ్డిని సన్మానిస్తున్న నాయకులు

చెన్నేకొత్తపల్లి: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో వీఆర్ఓల సంఘం జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికైన మహేశ్వరరెడ్డిని వైఎస్సార్‌సీపీ నాయకులు సోమవారం ఘనంగా సన్మానించారు. స్థానిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశంలో ఆయనను శాలువా, పూలమాలలతో సత్కరించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు గాలి లక్ష్మిరెడ్డి, బుక్కారెడ్డి, నాగరాజు, ఉపసర్పంచ్ రాజారెడ్డి, మురళి, వెంక తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ

తనకల్లు: మండల పరిధిలోని కొర్తికోటకు చెందిన వైఎస్సార్ సీపీ కార్యకర్త చిన్నప్ప అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే డాక్టర్ సిద్దారెడ్డి సోమవారం మృతదేహం వద్ద పూలమాలలు ఉంచి నివాళుర్పించారు. కుటుంబ సభ్యులను ధైర్యంగా ఉండాలని ఓదార్చారు. అనంతరం అంత్యక్రియల కోసం రూ. 10 వేలు, అలాగే వైఎస్సార్ బీమా తక్షణసాయం కింద మరో 10 వేలు అందజేశారు. వైఎస్సార్ సీపీ నాయకులు కొక్కంటి శ్రీనివాసులనాయుడు, గంగప్పనాయుడు తదితరులు ఉన్నారు.

ఆర్థిక సాయం



ఆర్థిక సాయం అందజేస్తున్న పూల శ్రీనివాస్‌రెడ్డి

నల్లచెరువు: మండల పరిధిలోని ఉప్పార్ల పల్లికి చెందిన మహబూబ్ బాష అనే యువకుడు గత నెల రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడు. విషయం తెలుసుకున్న వైఎస్సార్ సీపీ నాయకుడు, సీఈసీ సభ్యుడు పూల శ్రీనివాస్ రెడ్డి సోమవారం గ్రామానికి విచ్చేసి యువకుడిని పరామర్శించి రూ.10 వేలు ఆర్థిక సాయం కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ దశరథ నాయుడు, నాయకులు బసిరెడ్డి విశ్వనాథ్‌రెడ్డి, శ్రీధర్‌రెడ్డి తదితరులున్నారు.

తిరునాల మహోత్సవానికి..



విరాళం అందజేస్తున్న డాక్టర్ బత్తల హరిప్రసాద్

గాండ్లపెంట: గాండ్లపెంట గ్రామంలో వెలసిన గంగా భవాని ఆలయ తిరునాల నిర్వహణకు రూ. 15 వేలను సోమవారం వైఎస్సార్ సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి డాక్టర్ బత్తల హరిప్రసాద్ ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

‘పది’లో సర్కారు సత్తా

- ప్రభుత్వ విద్యార్థుల మెరుగైన ప్రతిభ
- మురిసిపోయిన తల్లిదండ్రులు



96 శాతం ఉత్తీర్ణత సాధించిన బత్తలపల్లి మహాత్మాజ్యోతిరావు పూలే పాఠశాల





సాయిలీల (571) తాడిమర్రి, నవ్యశ్రీ (579) కదిరి





అభిలాష (571) రామగిరి, తౌఫీక్ (573) కదిరి

ధర్మవరం: ధర్మవరం నియోజకవర్గంలోని ప్రభుత్వ, మున్సిపల్ పాఠశాలల్లో పదో తరగతి విద్యార్థులు పరీక్ష ఫలితాల్లో హవా కొనసాగించారు. 3,594 మంది విద్యార్థులకుగాను 2,526 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారని 1,078 మంది ఫెయిలైనట్లు విద్యాశాఖాధికారులు తెలిపారు.

- ధర్మవరం బీఎస్ఆర్ మున్సిపల్ బాలుర ఉన్నత పాఠశాలలో సాయిప్రసాద్ (586), ఏపీ మోడల్ స్కూల్‌లో ఆదిశంకర్, మురళీకృష్ణలు 586, కొత్తపేట మున్సిపల్ బాలికల ఉన్నత పాఠశాలలో ముబషీరా 584, సుందరయ్యనగర్ మున్సిపల్ ఉన్నత పాఠశాలలో చైతన్య 579 మార్కులు సాధించారు.
- ముదిగుబ్బ మండలంలో 58.49 శాతం ఉత్తీర్ణత సాధించారు. విద్యార్థి విష్ణుసహస్ర 581, గీత 574, ఫణీంద్ర 567 మార్కులు సాధించారు.
- బత్తలపల్లి మండలంలో 343 మంది పరీక్షలు రాయగా 220 మంది పాస్ అయ్యారు. 64.14 శాతం ఉత్తీర్ణత సాధించారు. మహాత్మా జ్యోతి బాపూలే పాఠశాల విద్యార్థులు 96.66 శాతం ఉత్తీర్ణత సాధించి ప్రతిభ కనబరిచారు.

94.28 శాతం ఉత్తీర్ణత

కదిరి అర్బన్: పదవ తరగతి పరీక్షా ఫలితాల్లో పట్టణంలోని మున్సిపల్ ఉర్దూ మెయిన్ ఉన్నత పాఠశాల 94.28 శాతం ఫలితాలు సాధించింది. మొత్తం 35 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 33 మంది పాస్ అయ్యారు. అర్షియా అనే విద్యార్థి 554 మార్కులు సాధించింది

- కదిరి జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థి అతీఫా 586 మార్కులు సాధించింది. ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థి సుఫియాన్ 558 మార్కులు సాధించాడు. కుటాగుళ్ల మున్సిపల్ ఉన్నత పాఠశాల విద్యార్థిని బీ పూజిత 557, పట్నం జడ్పీ హైస్కూల్ విద్యార్థి రామ్‌చరణ్‌తేజ 547 మార్కులు సాధించారు. జడ్పీ బాలికల హైస్కూల్ 60.52 శాతం, బాలుర హైస్కూల్ 48.97, జడ్పీహెచ్ఎస్ పట్నం 49 శాతం, జడ్పీహెచ్ఎస్ కుమ్మరవాండ్లపల్లి 36.36 శాతం, జడ్పీహెచ్ఎస్ కేఎస్‌పాళెం 50 శాతం, జడ్పీహెచ్ఎస్ బ్రాహ్మణపల్లి 50 శాతం, మున్సిపల్ హైస్కూల్ కుటాగుళ్ల 47.7, మున్సిపల్ హైస్కూల్ కదిరి 59.7శాతం, మున్సిపల్ ఉర్దూ మెయిన్ స్కూల్ 94.28, కేజీబీవీ కదిరి 78, కాళసముద్రం సోషల్ వెల్ఫేర్ పాఠశాల 86.6, ట్రైబల్ వెల్ఫేర్ పాఠశాల కదిరి 68.75, ట్రైబల్ వెల్ఫేర్ బాలికల 84శాతం ఉత్తీర్ణత సాధించాయి.

నల్లచెరువు: పదో తరగతి ఫలితాల్లో సర్కారు బడి విద్యార్థులు ప్రతిభ చూపారు. ఏపీ మోడల్ స్కూల్, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, కేజీబీవీ విద్యార్థులు మండల వ్యాప్తంగా పరీక్షా ఫలితాల్లో 336 మందిగానూ 246 మంది ఉత్తీర్ణత సాధించారు. దేవిరెడ్డిపల్లి ఏపీ మోడల్ స్కూల్ విద్యార్థిని కె.నవ్యశ్రీ 600 మార్కులకు 579 మార్కులతో మండల టాపర్‌గా నిలిచింది. స్థానిక జిల్లా పరిషత్ పాఠశాలకు చెందిన తౌఫిక్ 600 మార్కులకు 573 సాధించి స్కూల్ టాపర్‌గా నిలిచాడు. కేజీబీవీ విద్యార్థిని కీర్తన 565, మోడల్ స్కూల్‌కు చెందిన విద్యార్థినులు ప్రియాంక 560, శ్రీ రోజా 559, నల్లచెరువు, ఉబిచర్ల, తవళం మర్రి ఉన్నత పాఠశాలలకు చెందిన దీపక్ 553, వర్షిణి 536, ప్రణీత 522, పవన్ కుమార్ 522, జశ్వంత్ 516, సాయికృష్ణ 517, పి.మారుతీ ప్రసాద్ 509, రూపలీల 508, దీపిక 506, కె అక్రం బాష 500 మార్కులతో సత్తా చాటారు.

ఉపాధ్యాయుల హర్షం

తాడిమర్రి: పుల్లానారాయణపల్లి గ్రామానికి చెందిన విద్యార్థిని ప్రతిభ కనబరచింది. ఇజ్యం రామక్రిష్టారెడ్డి, చంద్రకళ దంపతుల కుమార్తె ఈ. సాయిలీల తాడిమర్రి జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాలలో చదువుతూ 600 మార్కులకు 571 మార్కులు సాధించి మండలంలో టాపర్‌గా నిలిచింది. ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, తోటి విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు. పాఠశాలలో 104 మంది పరీక్షలకు హాజరుకాగా 24 మంది ప్రథమశ్రేణి, 14 మంది ద్వితీయశ్రేణి, ఏడుగు తృతీయశ్రేణిలో మొత్తం 45 మంది ఉత్తీర్ణత సాధించినట్లు హెచ్ఎం జగన్‌మోహన్ తెలిపారు.

కనగానపల్లి: రామగిరి, చెన్నేకొత్తపల్లి, కనగానపల్లి మండలాలల్లోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో 60 శాతం పైగా విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. రామగిరి మండలంలో 66 శాతం మంది విద్యార్థులు పాసయ్యారు. పేరూరు, నసనకోటలోని గురుకుల పాఠశాల విద్యార్థులు 97 శాతం పైగా ఉత్తీర్ణత సాధించారు. పేరూరు ఏపీఆర్ఎస్ విద్యార్థులు సాయి ఈశ్వర్ (573), కల్యాణకుమార్ (568) మార్కులు సాధించంగా, నసనకోటలోని బాలికల పాఠశాలకు చెందిన అభిలాష (571), రాజేశ్వరి (567) మార్కులు సాధించి సత్తా చాటారు. చెన్నేకొత్తపల్లి మండలం మేడాపురం, వెల్దుర్తి, కనుముక్కల ఉన్నత పాఠశాలలతో పాటు కేజీబీవీ, మోడల్ స్కూల్‌లో విద్యార్థులు 60 శాతం మంది పాసయ్యారు. కనగానపల్లి మండలం మద్దెలచెరువు, మామిళ్లపల్లి, ముత్తువకుంట్ల, తగరకుంట, మోడల్ స్కూల్, కేజీబీవీ లో 50 శాతం మంది విద్యార్థులు ప్రథమ శ్రేణిలో పాసయ్యారు.

అక్కాచెల్లెలు ప్రతిభ..

కనగానపల్లి ఆదర్శ పాఠశాలలో చదువుతున్న అక్కచెల్లెలు ఇంటర్, పదో తరగతి పరీక్షలలో 90 శాతం పైగా మార్కులు సాధించి టాపర్స్‌గా నిలిచారు. యలకుంట్ల గ్రామానికి చెందిన జాహ్నవి ఇంటర్‌లో 903 మార్కులతో మండల టాపర్‌గా నిలవగా, ఆమె సోదరి కే. మహేశ్వరి పదో తరగతి పరీక్షలలో 542 మార్కులు సాధించి టాపర్‌గా నిలిచింది.

- మామిళ్లపల్లి జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థి జీ. వంశీ 570 మార్కులు సాధించి మండల టాపర్‌గా నిలిచారు. విద్యార్థి గ్రామంలోని ఓ సామాన్య రైతు కూలీ కిష్టయ్య కుమారుడు. ప్రభుత్వ పాఠశాలలో చదువుతూ ఇన్ని మార్కులు సాధించిన విద్యార్థిని పలువురు అభినందించారు.

మండల టాపర్‌గా తోట జ్యోతిశ్రీ

గాండ్లపెంట: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని తోట జ్యోతిశ్రీ 600 మార్కులకు 572 సాధించి మండల టాపర్‌గా నిలిచింది.గాండ్లపెంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుంచి 147 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా 85 మంది ఉత్తీర్ణులు అయ్యారు. ప్రథమ స్థానంలో 45 మంది, ద్వితీయ స్థానంలో 32 మంది, తృతీయ స్థానంలో 8 మంది ఉత్తీర్ణులు కాగా, 10 మంది 500 పైగా మార్కులు సాధించారు. ఉత్తీర్ణత 58 శాతం ఉంది.

విరిసిన సంతోషం..

ఓడీ చెరువు: మామిళ్లకుంట్లపల్లికి చెందిన రైతు బీరే జయచంద్ర నాయుడు, మంజుల దంపతుల కుమారుడు బీరే శ్రీకాంత్ ప్రభుత్వ పాఠశాలల్లో మండల టాపర్‌గా నిలిచాడు. తండ్రి వ్యవసాయం, తల్లి గృహిణి, పెద్దకుమారుడు బీరే శ్రీకాంత్ స్థానిక ప్రభుత్వ పాఠశాలలో పది వరకు చదువుకున్నాడు.568 మార్కులు సాధించి టాపర్‌గా నిలిచాడు. తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేస్తూ కుమారున్ని ఇంజినీరింగ్ చదివించనున్నట్లు చెప్పారు. గొనిపల్లికి చెందిన హోటల్ రమేష్, రమణమ్మ కుమార్తె అశ్విని గొనిపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదివి 557 మార్కులు సాధించింది.

పాలిసెట్‌కు ఏర్పాట్లు పూర్తి

కదిరి అర్బన్: ఈ నెల 10న జరిగే పాలిసెట్ ప్రవేశ పరీక్షకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు కో ఆర్డీనేటర్ నారాయణ సోమవారం తెలిపారు. కదిరిలో 8 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. విద్యార్థులు హాల్ టికెట్‌తో పాటు ఆధార్‌కార్డు, బాల్ పాయింట్ పెన్, హెచ్‌బీ పెన్సిల్ తీసుకురావాలని సూచించారు. మొత్తం 1,926 మంది పరీక్షలకు హాజరుకానున్నట్లు తెలిపారు.

పరీక్షా కేంద్రాలివే..

ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల (కుటాగుళ్ల), ఎస్టీఎస్ఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల, వేమన బాలుర ఉన్నత పాఠశాల, ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల, ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల, ఎస్ఎంజేఎల్ డిగ్రీ కళాశాల, నారాయణ ఇంగ్లిష్ మీడియం హైస్కూల్, మున్సిపల్ ఉన్నత పాఠశాల కుటాగుళ్ల.

‘స్పందన’ ప్రతిష్టాత్మకం

తాడిమర్రి: గ్రామ సచివాలయాల్లో నిర్వహిస్తున్న స్పందన కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలని తహసీల్దార్ నాగరాజు ఆదేశించారు. సమస్యల పరిష్కారం కోసం తహసీల్దార్ కార్యాలయం, గ్రామ సచివాలయాల్లో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో ఒక్క అర్జీ కూడా అందలేదని ఆయన తెలిపారు. ప్రభుత్వం ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయిలోనే పరిష్కరిస్తున్నందున ప్రజలు రాలేదన్నారు. కార్యక్రమాలకు మండలస్థాయి అధికారులు, గ్రామ సచివాలయ సిబ్బంది తప్పనిసరిగా హాజరు కావాలన్నారు.

వ్యక్తికి తీవ్ర గాయాలు

ముదిగుబ్బ: మండల పరిధిలోని మలకవేమల క్రాస్ సమీపంలో ఉన్న రైల్వే ఓవర్ బ్రిడ్జిపై ఆదివారం అర్ధ రాత్రి సమయంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన మేరకు.. కర్నూలు జిల్లా ప్యాపిలికి చెందిన బొలేరో వాహనం కదిరి వైపు వెళ్తూ మలకవేమల క్రాస్ సమీపంలో ముందు వెళుతున్న లారీని ఢీకొంది. ప్రమాదంలో బొలేరో డ్రైవర్ నారాయణకు తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు 108 వాహనంలో బాధితున్ని అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

రోగులకు పండ్ల పంపిణీ

ధర్మవరం అర్బన్: రెడ్‌క్రాస్ సేవా గుణాన్ని విస్తరింపజేస్తామని రెడ్‌క్రాస్ సంస్థ జీవితకాల సభ్యులు డాక్టర్ నరసింహులు, శ్రీసత్యసాయి జిల్లా వైస్ చైర్మన్ పోలా ప్రభాకర్‌లు తెలిపారు. ప్రపంచ రెడ్‌క్రాస్ దినోత్సవం సందర్భంగా సోమవారం ప్రభుత్వ ఆసుపత్రిలోని రోగులకు అరటిపండ్లు, బ్రెడ్డు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రపంచ రెడ్ క్రాస్ వ్యవస్థాపకులు హెన్రీ డ్యూనాండ్ జయంతిని పురస్కరించుకుని రెడ్‌క్రాస్ దినోత్సవంగా జరుపుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ పద్మలత, డాక్టర్ నజీర్, రెడ్‌క్రాస్ సంస్థ సభ్యులు సత్యనిర్ధారణ్ తదితరులు పాల్గొన్నారు.

‘ఫ్యామిలీ ఫిజిషియన్’ పరిశీలన

పుట్టపర్తి అర్బన్: పుట్టపర్తి మండలం రాచువారిపల్లి గ్రామంలో సోమవారం చేపట్టిన ఫ్యామిలీ ఫిజిషియన్ కార్యక్రమాన్ని జిల్లా నోడలాఫీసర్ డాక్టర్ సెల్వియా సల్మాన్ పరిశీలించారు. ప్రజలకు అందుతున్న సేవలు, వ్యాధి నిరోధక టీకాలు, పరిసరాల పరిశుభ్రతపై పలు సూచనలు చేశారు. ల్యాబ్ పరీక్షలు, సీడీ, ఎన్‌సీడీ వ్యాధుల గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డాక్టర్ నాగరాజునాయక్, సూపర్‌వైజర్లు చంద్రకళ, వెంకటరాముడు, ఎంఎల్‌హెచ్‌పీ విజయ్‌భాస్కర్, సిబ్బంది శివ, రాధమ్మ, లక్ష్మీపతి, సునంద, మహేశ్వరి, నాగరత్నమ్మ తదితరులు పాల్గొన్నారు.

నేడు సర్వసభ్య సమావేశం

నల్లచెరువు: మండలప్రజా పరిషత్ కార్యాలయంలో మంగళవారం సర్వసభ్య సమావేశం ఎంపీపీ రమణారెడ్డి అధ్యక్షతన నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ శకుంతల తెలిపారు. ఉదయం 11 గంటలకు ప్రారంభమయ్యే సమావేశానికి స్థానిక ప్రజా ప్రతినిధులు హాజరుకావాలన్నారు.

11న గాండ్లపెంట సర్వసభ్య సమావేశం

గాండ్లపెంట: మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఈ నెల 11న ఉదయం 11 గంటలకు ఎంపీపీ జగన్మోహన్ అధ్యక్షతన నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ అంజినప్ప సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు.

ఇబ్బందులున్నా ఆగని సంక్షేమం



ప్రజా సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే పీవీ సిద్దారెడ్డి

కదిరి అర్బన్: ఆర్థిక ఇబ్బందులున్నా సంక్షేమాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరుగులు పెట్టిస్తున్నారని ఎమ్మెల్యే డాక్టర్ పీవీ సిద్దారెడ్డి పేర్కొన్నారు. సోమవారం కదిరి మండల పరిధిలోని కుమ్మరవాండ్లపల్లి సచివాలయం 1.2, పరిధిలో ఉన్న హమాలీక్వార్టర్స్, ఇండస్ట్రియల్ ఏరియా ప్రాంతాల్లో ఆయన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ చంద్రబాబు 14 ఏళ్ల రాష్ట్రంలో దుష్టపాలన చేశారన్నారు. తాము అధికారంలోకి వచ్చిన నాలుగేళ్లలో ఆర్థిక ఇబ్బందులు, కరోనా సమస్యలు ఉన్నా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాల వెల్లువ కొనసాగిస్తున్నారని తెలిపారు. సచివాలయం అనే వ్యవస్థతో అర్హులందరికీ సిఫారసులు లేకుండా పథకాలు అందిస్తున్నామని చెప్పారు.

ఎమ్మెల్యే దృష్టికి వచ్చిన కొన్ని సమస్యలు...

కాలనీలో సిమెంటు రోడ్లు, మురుగుకాల్వలు, విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయాలని హమాలీ క్వార్టర్, కుమ్మరవాండ్లపల్లి ప్రజలు కోరగా ఎమ్మెల్యే సంబంధిత శాఖల అధికారులతో మాట్లాడారు. ఎస్టిమేట్లు తయారు చేయాలని ఆదేశించారు. చిన్నాచితకా సమస్యలు అక్కడికక్కడే పరిష్కరించారు. కార్యక్రమంలో ఎంపీపీ అమరనాథ్‌రెడ్డి, సర్పంచ్ శాంతాబాయ్, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ యువజన విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మణికంఠనాయక్, మండల కన్వీనర్ ప్రకాష్, ఎంపీటీసీ పుల్లయ్య, సచివాలయాల కన్వీనర్ మధుసూధన్‌రెడ్డి, అగ్రీ అడ్వయిజరీ బోర్డు జిల్లా మెంబర్ సుధీర్‌రెడ్డి, సర్పంచ్ బాస్కర్, కో ఆప్షన్ అల్లాబకష్, సింగిల్ విండో అధ్యక్షులు ప్రసాద్, మార్కెట్ యార్డ్ డైరెక్టర్ రామచంద్ర, వెంకటేష్‌నాయక్, నాయకులు ఆదినారాయణ,ప్రభాకర్‌రెడ్డి, బాబ్జాన్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

కర్ణాటక మద్యం పట్టివేత

కనగానపల్లి: బాలేపాళ్యం గ్రామంలో సోమవారం అక్రమంగా విక్రయిస్తున్న 48 కర్ణాటక మద్యం ప్యాకెట్లు పట్టుబడినట్లు ఎస్ఐ హనుమంతరెడ్డి తెలిపారు. కర్ణాటక ప్రాంతంలోని తిరుమణి నుంచి మద్యం ప్యాకెట్లు తెచ్చి, గ్రామంలో విక్రయిస్తున్న ఎరుకల అశోక్‌ను పట్టుకొని, అతని నుంచి మద్యం ప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

చెక్‌పోస్టులో..

రామగిరి: కర్ణాటక ప్రాంత పరిధిలోని ఎగువపల్లి చెక్‌పోస్ట్‌లో అక్రమంగా తరలిపోతున్న మద్యం పట్టుకున్నట్లు ఎస్ఐ జనార్ధన్‌నాయుడు తెలిపారు. ప్రస్తుతం కర్ణాటక రాష్ట్రంలో ఎన్నికలు జరుగుతున్న నేపథ్యంలో వాహన తనిఖీలు చేస్తున్నట్లు తెలిపారు. సోమవారం వేకువజామున కళ్యాణదుర్గానికి చెందిన రామాంజినమ్మ ద్విచక్ర వాహనంపై 198 టెట్రా ప్యాకెట్లను తీసుకెళ్తుండగా పట్టుకున్నట్లు తెలిపారు.

కోలాహలంగా ఊరేగింపు

నల్లమాడ: పసిబాల చిన్నమ్మ పరష మహోత్సవంలో భాగంగా సోమవారం అమ్మవారి ఊరేగింపు కోలాహలంగా సాగింది. బసిరెడ్డిపల్లి సమీపంలోని నీళ్ల బావి వద్ద పూజారులు అక్కదేవతలకు పూజలు నిర్వహించారు. అక్కడి నుంచి ప్రత్యేకంగా అలంకరించిన గంపలో ఉరుము వాయిద్యాలతో చిన్నమ్మ దేవతను ఊరేగింపుగా వంకరకుంట గ్రామ సమీపంలోని సోమగుట్ట వారి బావి వద్దకు తీసుకొచ్చారు. అక్కడ ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం రాత్రికి పరష జరిగే చిన్నమ్మ తోపులోని గుడిలో అమ్మవారిని కొలువుదీర్చారు. ఈ సందర్భంగా గుడిలో భజనలు, చిన్నమ్మ పద్యము చెప్పు కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో బసిరెడ్డిపల్లి, వంకరకుంట, సానేవారిపల్లి చుట్టుప్రక్కల గ్రామాల ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

అప్పుల బాధ తాళలేక వ్యక్తి ఆత్మహత్య



నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు తోపుదుర్తి రాజశేఖర్‌రెడ్డి

చెన్నేకొత్తపల్లి: మండల కేంద్రానికి చెందిన కావటి జయరామప్ప (42) అప్పుల బాధ తాళలేక సోమవారం ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన మేరకు.. కావటి జయరామప్ప అనే వ్యక్తి వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. పంటల సాగుకు, కుమార్తె వివాహానికి రూ.4 లక్షల వరకు అప్పు చేశాడు. అప్పు తీర్చేమార్గంలేక, మదనపడుతుండేవాడు. ఎవరూలేని సమయంలో ఇంట్లో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడికి భార్య రత్నమ్మ, కుమారుడు సుధాకర్ ఉన్నారు. రాప్తాడు వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు తోపుదుర్తి రాజశేఖర్‌రెడ్డి.. మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

మోడల్ స్కూల్ ప్రవేశానికి దరఖాస్తు చేసుకోండి



పోస్టర్లను విడుదల చేస్తున్న ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు

పుట్టపర్తి అర్బన్: పుట్టపర్తి మండలం జగరాజుపల్లి మోడల్‌స్కూల్‌లో 6వ తరగతి ప్రవేశాలకు విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ రమేష్ బాబు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. సోమవారం పాఠశాల ప్రవేశ పరీక్షకు సంబంధించిన పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రవేశ పరీక్ష జూన్ 11వ తేదీ ఉదయం 10 గంటలకు ఉంటుందన్నారు. ఈ విద్యాసంవత్సరంలో 5వ తరగతి చదువుతూ ప్రమోషన్‌కు అర్హత పొంది ఉండాలన్నారు. బీసీ విద్యార్థులు 2011 సెప్టెంబర్ నుంచి 2013 ఆగస్టు మధ్య జన్మించి ఉండాలన్నారు. ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు 2009 సెప్టెంబర్ - 2013 ఆగస్టు మధ్య జన్మించి ఉండాలన్నారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న వారు సంబంధిత పత్రాలు పాఠశాలలో అందజేయాలని, పాఠశాలకు వచ్చి కూడా దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. ఓసీ, బీసీ విద్యార్థులకు పరీక్ష ఫీజు రూ.150, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు రూ.75 ఉంటుందన్నారు. అప్లికేషన్లు ఈనెల 10వ తేదీ నుంచి స్వీకరించనున్నట్లు చెప్పారు.

వేసవి శిక్షణ సద్వినియోగం చేసుకోండి

చెన్నేకొత్తపల్లి: గ్రంథాలయంలో ప్రభుత్వం నిర్వహిస్తున్న వేసవి శిక్షణ తరగతులను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఎస్ఐ శ్రీధర్ తెలిపారు. సోమవారం స్థానిక గ్రంథాలయంలో శిక్షణ తరగతులను ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ విద్యార్థులకు పుస్తక పఠనం, చిత్రలేఖనం, స్పోకెన్ ఇంగ్లిష్‌పై శిక్షణ ఉంటుందన్నారు. గ్రంథాలయాధికారి కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయంలో..

ధర్మవరం: పట్టణంలోని గ్రంథాలయంలో వేసవి శిక్షణా శిబిరాన్ని ప్రారంభించారు. సోమవారం ఉపాధ్యాయులు నరసింహులు, గీత, నారాయణ స్వామి, శ్రీనివాసులు, ఎల్ఐసీ ఏజెంట్లు నాగరాజు, ముకుందలు విద్యార్థులకు ఉపయోగపడే ఆటల పరికరాలను ప్రదర్శనగా ఉంచారు. గ్రంథాలయాధికారిణి సౌభాగ్యవతి, సిబ్బంది పాల్గొన్నారు.

వేసవి విజ్ఞాన శిబిరం ప్రారంభం

గాండ్లపెంట: స్థానిక శాఖ గ్రంథాలయంలో సోమవారం సర్పంచ్ రహంతుల్లా వేసవి విజ్ఞాన శిక్షణ శిబిరాన్ని ప్రారంభించారు. సర్పంచ్ మాట్లాడుతూ విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. నెల రోజుల పాటు నిర్వహించే శిక్షణలో పాల్గొని విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని గ్రంథాలయాధికాణి ఫరియాబాను కోరారు. కాగా కటారుపల్లి శాఖ గ్రంథాలయంలో కూడా గ్రంథాలయాధికారి విజ్ఞాన శిక్షణ శిబిరాన్ని ప్రారంభించారు.

సద్వినియోగం చేసుకోవాలి

తాడిమర్రి: స్థానిక గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణా తరగతులను సద్వినియోగం చేసుకోవాలని గ్రంథాలయ అధికారి శీనా నాయక్ విద్యార్థులను కోరారు. సోమవారం ఆయన విద్యార్థులు, పాఠకులతో కలసి వేసవి శిక్షణశిబిరాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో రామకృష్ణ, సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

సృజనాత్మకత పెంచడమే లక్ష్యం

పుట్టపర్తి టౌన్: వేసవి సెలవుల్లో విద్యార్థుల్లో సృజనాత్మకత, ఏకాగ్రత పెంచడమే ప్రభుత్వ లక్ష్యమని కౌన్సిలర్ సూర్యాగౌడ్, గ్రంథాల అధికారి అంజనేయులు పేర్కొన్నారు. సోమవారం పుట్టపర్తి పట్టణంలో గ్రంథాలయంలో తరగతులను ప్రారంభించారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి అంజనేయులు, సిబ్బంది రాంప్రసాద్ తదితరులున్నారు.

రామగిరి: మండల కేంద్రంలోని గ్రంథాలయంలో వేసవి శిక్షణ శిబిరాలను ప్రారంభించినట్లు గ్రంథాలయ అధికారి వెంకటేష్, సర్పంచ్ మీనుగ నాగరాజులు సోమవారం తెలిపారు. సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.

పుస్తక పఠనాన్ని అలవర్చుకోవాలి

కనగానపల్లి: ప్రతి ఒక్కరూ పుస్తక పఠనాన్ని అలవర్చుకొని, తద్వారా జ్ఞానాన్ని పొందాలని రాష్ట్ర దృశ్య కళల అకాడమీ డైరెక్టర్ ప్రభాకర్ తెలిపారు. సోమవారం స్థానిక గ్రంథాలయ కార్యక్రమంలో వేసవి విజ్ఞాన శిబిరాన్ని ప్రారంభించారు. గ్రంథాలయాధికారి గోవిందు ఆధ్వర్యంలో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. సర్పంచ్ అంకే పరిమళ, సొసైటీ అధ్యక్షుడు వలగొండ భాస్కర్ తదితరులున్నారు.

‘తొలగించిన వలంటీర్లను తిరిగి తీసుకోవాలి’

కదిరి టౌన్: పట్టణంలోని 10వ వార్డులో పనిచేస్తున్న వలంటీర్లు సమీర్, ఫాహమీదను తొలగించడాన్ని వ్యతిరేకిస్తూ సోమవారం మున్సిపల్ కార్యాలయం ముందు వార్డు కౌన్సిలర్ దిల్షాదున్నీషా, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు కె.ఎస్.బహుద్దీన్ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. వారిని తిరిగి తీసుకోవాలని డిమాండ్ చేశారు. అవినీతికి పాల్పడిన బాబాను తొలగించాలన్నారు. పాలన వ్యవహారంలో జోక్యం చేసుకుంటున్న ఎంఎల్‌ఓ వాసీమ్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మున్సిపల్ కమిషనర్ శ్రీవారిబాబుకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో వార్డు మహిళలు పాల్గొన్నారు.

అర్జీలను సత్వరమే పరిష్కరించాలి

పుట్టపర్తి: స్పందన కార్యక్రమంలో అందే అర్జీలను వెంటనే పరిష్కరించాలని ఎంపీపీ శ్రీధర్‌రెడ్డి సూచించారు. ఆయన సోమవారం వైఎస్సార్ సీపీ జిల్లా యూత్ నాయకుడు గోవర్ధన్‌రెడ్డితో కలిసి మండలకేంద్రంలో ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. సచివాలయాల సిబ్బంది, వలంటీర్లు ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు ప్రజలకు చేరవేసే కార్యక్రమాన్ని మరింత బాధ్యతగా తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీనివాసులు, సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

కనగానపల్లి: మండల కేంద్రంలో ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు గాయపడ్డారు. స్థానికులు తెలిపిన మేరకు.. వేపకుంటకు చెందిన డి.ముత్యాలు, ధర్మవరం మండలం నడిమిగడ్డపల్లికి చెందిన భానుప్రకాష్‌రెడ్డి ఇద్దరూ ద్విచక్ర వాహనాలపై వెళ్తూ తగరకుంట రహదారిలో ఎదురెదురుగా ఢీకొన్నారు.

ఈ ప్రమాదంలో ఇద్దరికీ గాయాలయ్యాయి. స్థానికులు 108 వాహనంలో అనంతపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ముత్యాలును మెరుగైన వైద్యం కోసం బెంగళూరుకు తీసుకెళ్లినట్లు అతని బంధువులు తెలిపారు. పోలీసులు కేసు విచారిస్తున్నారు.